నినాదం
సాహితీ లహరి
ఆదివారం 19-04-2026

# పఠాభి కవిత్వం ప్రయోగ వైచిత్రి



**విచిత్ర భావాల విలక్షణ కవి పఠాభి. ఎందుకంటే తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి గారి 'ఫిడేలు రాగాల డజన్'కు శ్రీశ్రీ రాసిన ఇంట్రోలో "విచిత్రమే సౌందర్యం సౌందర్యమే విచిత్రం" అనడంలో విచిత్రమైన కవితా భావుకత విలక్షణంగా కవిత్వంలో దర్శనమిస్తుంది. "భావకవిని కాను అహంభావ కవిని నేను" అన్న భావనలో మాటల్లో మృదుభాషిగా భావుకతలో అహంభావుకుడిగా దర్శనమిస్తాడు.**

*ఎవర్నని యనుకొంటరో మీరు నన్ను?*
*నేను పఠాభిని...*
*కాంగ్రేసు రాష్ట్రపతి స్థానాని కోసం*
*బాబూ సుభాసుబోసుతో పోటీజేసి*
*ఓడిపోయిన డాక్టర్ పట్టాభిని*
*గాన్నేను మరో పఠాభిని;*

**అని 'ఆత్మకథ' కవితలో తనకు తాను నిర్వచించుకున్నాడు. "కాని అక్కడక్కడ ఈ పద్యాలలో వచ్చునట్టి పఠాభి అను పేరుగల పాత్రకు, గ్రంథకర్తకు ఏ మాత్రం సంబంధంలేదని గమనింపు; 'కృష్ణపక్షం'లోని 'కృష్ణ' కును దాని గ్రంథకర్త నామం లోని 'కృష్ణ'కును ఎలా సంబంధం లేదో అలాగే!" అని తన విలక్షణతను, విచక్షణతను వినూత్న పంథాలో పేర్కొన్నాడు. "నాకు విచిత్రమైన భావాలున్నాయని నా కన్నులలో టెలిస్కోపులు మయిక్రోస్కోపులు న్నాయంటాడు. పఠాభి చూసే చూపు కొత్తదిగా ఉంటుంది. అభివ్యక్తీకరణలో విలక్షణత, వినూత్న పంథాలో వెల్లివిరుస్తుంది.**

*"నా ఈ వచన పద్యాలనే దుడ్డుకర్రల్తో*
*పద్యాల నడుముల్ విరగదంతాను*
*చిన్నయసూరి బాలవ్యాకరణాన్ని*
*చాల దండిస్తాను*
*ఇంగ్లీషు భాషా భాండారంలో నుండి*
*బందిపోటుంజేసి కావల్సిన*
*మాటల్ను దోస్తాను"*

పై భావనలో సంప్రదాయపద్యం, వ్యాకరణం పట్ల విముఖత, ఆంగ్ల పదాల మీద మోజు, ఆధునికత వైపు పయనం పఠాభి పల్కులలో ప్రతిధ్వనిస్తాయి. "నా యిష్టం వచ్చినట్లు చేస్తాను, అనుసరిస్తాను నవీనపంథా" అన్న నవీనుడు పఠాభి. ఆంగ్లపదాలను తెలుగు పదాలతో జోడించి వ్యక్తీకరణలో వినూత్నత, విలక్షణలను ప్రదర్శించిన ఆధునికుడు తిక్కవరపు పట్టాభి రామిరెడ్డి. తగిలింపబడి యున్నది జాబిల్లి/ చయినాబజారు గగనములోన, పయిన / అనవసరంగా అఘోరంగా....

*"కానీ దురదృష్ట శశీ!*
*నీవు మాత్రం పదిహేను రోజుల్లోన గాని*
*నీ రూపాన్నంతా మార్చుకోలేవు*
*చాలాకాలం, చాలా ఆలస్యం,*
*ప్రజాదృష్టిని ఆకర్షించటంలో*
*మార్కట్లోని దుస్సాధ్య కాంపిటీషన్‌కు నీవు*
*తట్టుకోలేవు జాగ్రత్త సుమా*
*దివాలా తీస్తావు. నీవిచ్చోట*

ఖచ్చితంగా అనవసరం నిరుపయోగం కూడాను అని 'జాబిల్లి' కవితలో సహజత్వానికి, కుత్రిమత్వానికి, ప్రాచీనత, ఆధునికత-అత్యాధునికతకి మధ్య వ్యత్యాసాన్ని, సమాజంలో పోటీతత్వాన్ని, ప్రపంచీకరణ నేపథ్యాన్ని అక్షరబద్ధం చేశాడు పఠాభి. 'దుస్సాధ్య కాంపిటీషన్' లాంటి వినూత్న ప్రయోగం చేయటంలో దిట్ట పఠాభి. "శశీ! చయినాబజారు గగనానికీ నాకూ ఏ మాత్రం సరిపోదు దాంపత్యం" అంటాడు. "శశీ! నీ గుండ్రని మోమందపు తరహాసయితము మాకేమి నచ్చనే నచ్చదు! నోరూరును మాకు, నాగరిక కన్యల / పవుడర్ పూయబడిన ముఖాలంటే అని ముమ్మాటికీ నీవిచ్చోట అనవసరం" అంటాడు. పఠాభి చెప్పదలుచుకున్న విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు సూటిగా చెప్పడంలో తనకు తానేసాటి.

చీలు దారుల్లోన నిల్చోనున్నాడు పోలీసు భటుడు అని భరతనాట్యం బాడుచున్న/ప్రశాంతప్రకాశ ముఖంబుతోడి/ నటర్షి చూడామణిలాగా కన్పిస్తున్నాడు" అని పోలీసుని 'నటర్షి చూడామణిలా' పేర్కొన్నాడు. "బల్బుహారన్ల తాళాం తోడి/ యిలక్ట్రికు హారన్ల రాగానికిన్ని/ మోటారు సయికిళ్ళ మృదంగానికినీ, అనుగుణ్యంగా నర్తిస్తుంటాడు అని పోలీసును అభివర్ణించి అతని లక్షణాలను బట్టి 'మహాశక్తి సంపన్నుండగు యోగికాడా?' అని ప్రశ్నించడంలో విలక్షణత కన్పిస్తుంది.

"నవ్యస్త్రీ గురించి "క్రాస్వర్డు పజిల్సులాగున్న నీ కన్నులను సాల్వు జేసే మహాభాగ్యం ఏమానవునిదో కదా! కన్నులను క్రాస్వర్డు పజిల్సు" అని ఎవరూ పేర్కొనని పదబంధాన్ని సృష్టించిన వినూత్న పదశిల్పి పఠాభి. 'మరీనా' కవితలో

*అహో! జాతి కన్నియ చిక్కని నిక్కబొడుచుకొని*
*వచ్చుచున్నట్టి గట్టిరొమ్ము*
*మగనిచే తృప్తి గననట్టి*
*అయ్యంగారి లలామగీటు "హంగ్రీ కనులు"*

అంటాడు."హంగ్రీకనులు" లాంటి ఎన్నో పదాలు సృష్టించిన ఘనత పఠాభికి దక్కుతుంది. ఆ పదసృజనలో లోతైన భావుకత కన్పిస్తుంది.

"ఓ బోగంచానా! నీవు! సంఘానికి వేస్టుపేపరు బాస్కటువా? / మష్టుమషాణము పడవేయుబడునట్టి దిబ్బవా?" అని ప్రశ్నించి "కానీ నీవు మటుకు ఓ బోగందానా! ముసుగులేని నిష్ఠురమగు నిజానివి / నీడపడనటు వంటి నిర్మలమగు నిజానివి" అని జగత్తులోకి వాస్తవాన్ని 'స్టేట్‌మెంట్'లా కవిత్వరూపంలో ప్రకటించాడు పఠాభి.

'ఉద్యోగం పురుష లక్షణం, నిరుద్యోగం మహాపురుష లక్షణం' అంటాడు. "రాటము మీద వడకుచుండుట, పోరాటములోన వడకకుండుట గాంధీ ఉపదేశద్వయం అంటాడు. "ఈనాడు వ్యాకరణంలోనేగాక అంతర్జా తీయ వ్యవహారాల్లో కూడా సంధులు పాటింపబడటం లేదు" అంటాడు. "తీసినా వేసినా బాధ కల్పించునవి పన్నులు" అంటాడు. "పంట పండిం చటంలో పూజ్యమయినా కోతలు కోయటంలో మొనగాడు" అని పఠాభి పంచాంగం చెప్పాడు. గ్రామాలు గరిక ప్రదేశాలు గాని నాగరిక ప్రదేశాలు కావంటాడు. శూన్యానికి కూడా ప్రయోజనం వుంది. లోహమూ శూన్యం కలిసి పాత్రగా పరిణమించుచున్నవంటాడు. అతివల అధరాల మీద వుండేది అమృతం కాదు. అది అనృతం అంటాడు. గణితముకన్ననూ నాకు మణి తము ఇష్టమంటాడు పఠాభి. యుద్ధమ్ము వలన వసుధలోని సువర్ణంబు లోపించి వధ మాత్రము నిలంబడియున్నది" అంటాడు. "చనిపో యిన వాని నామస్మరణం కన్నవాని వీలునామ స్మరణం చేస్తుంటారు బంధు మిత్రులు" అన్న వాస్తవకోణాన్ని ఆవిష్కరించాడు. "కాంచనంత, కాంత, కాదంబరి అనేవి జగతిలో ముక్కాలు; మిగిలింది నేను" అంటాడు. "ఉద్యోగులలో రెండు రకాల వారున్నారు/ చేసే వారు కొందరు/ కాజేసే వారు కొందరు" అని ఉద్యోగుల తీరుతెన్నులను సమీక్షించారు.

*"ఈనాడు అంతా తారుమారు*
*ఆశలు మన్ను ముట్టినవి*
*ధరలు మిన్ను ముట్టినవి"*

అన్న పల్కులలో సమాజంలోని పరిస్థితులను బట్టి ఆశలు నెరవేరక 'మన్ను'ను ముట్టితే ధరలేమో ఆకాశాన్ని ముట్టాయని అన్నీ తారుమారైన వైనాన్ని ముచ్చటగా మూడు వాక్యాలలో పంచాంగం ద్వారా భాష్యం చెప్పాడు. 'చిన్మయానందం కొందరికి / జిన్‌మయానందం అనేకులకు" అంటూ భావాన్ని ఆంగ్ల, ఆంధ్ర భాషలను మిక్సర్ చేసి పొట్లం కట్టినట్లు అక్షరబద్ధంచేసి కవిత్వసృజన చేస్తాడు పఠాభి.

"గాంధీ మహాత్ములు ఒకే ఒక్కరు / బ్రాందీ మహాత్ములు మటుకు పెక్కురు" అంటాడు. ద్రవ్యం యావత్తూ పోయింది ద్రవం లాగా అంటాడు. "వెలయాలు చాలా ప్రియము / ఆలు చాలా సరసము" అంటాడు. సారాయి త్రాగినవాడు / షరాయి వీడి పోతున్నా తాను / వయిస్రాయి ననుకుంటాడు. "సినిమా వ్యాపారం బ్రహ్మాండమైన లాటరీ / అదృష్టం వున్నవాడు వాసన్ / లేనివాడు ఉపవాసన్" అని సినిమా జాతకాన్ని 'లాటరీ'తో పోల్చి చెప్పాడు. తలంబ్రాలను గురించి "తలంబ్రాలు కాదు / అది తలన్ బ్రాలు" అంటాడు. 'దంతి కన్నా వదంతి పెద్దది' అంటాడు. "వధూవరులకు చదువుకన్నా / చదివింపు లెక్కువగా వున్నవి" అన్న వ్యంగ్యాస్త్రాలు పఠాభి పల్కులలో ప్రతిధ్వనిస్తాయి. కవులు చంద్రుని అమృతమండలం అంటారు. కాని శాస్త్రజ్ఞులు చెప్పేది మృతమండలం అని అంటాడు. కవులు, శాస్త్రజ్ఞుల భావనలో కల్పన, వాస్తవిక జగత్తులను బేరీజు వేసాడు పఠాభి. ప్రజాస్వామ్యాన్ని గూర్చి "సామాన్యులనే మాన్యులుగా తలంచుపద్ధతి 'డెమాక్రసి' అంటాడు.

'రామరాజ్యం కాదు నేను కోరేది, నేను కోరేది విరామరాజ్యం' అంటాడు. 'చుక్కెదురు కావడం మంచిది కాదుగాని, చక్కని చుక్కెదురు కావడం అదృష్టమే' అంటాడు. 'ప్రేమ'లో పెనవేసుకొన్న ముడిని గూర్చి "విప్పుటకు వీలుకానిది ప్రేమడి" అంటాడు. గిరులకు పూర్వం యోగులు పోయేవారు; ఇప్పుడు భోగులు పోతున్నారు నీలగిరులకు" అంటారు. "హిమాలయంలోనే కాదు హిమం వుండేది; వనితా మణుల వదనాలలో సైతం హిమనీ స్నో వుంది" అంటూ ప్రతిపదంలోనూ సౌందర్యాన్ని అన్వేషించి పదచమత్కారాలను సృజించటంలో పఠాభిది అందెవేసిన చెయ్యి. "పూర్వం మంత్రాలను రహస్యంగా కాపాడేవారు; ఈనాడు రహస్యంగా కాపాడేది యంత్రాలను" అంటాడు. "కాకికన్ననూ దయనీయం ఏకాకి" అంటాడు. "రెక్కాడితే గాని డొక్కాడని వాడు రైల్వే సిగ్నలర్" అంటారు. "కారుకన్నాస్పీడు పుకారు" అంటారు. "కాసుల రాబడి తప్ప మరేమీ తలంచనివారు, నిజంగా రాకాసులు" అంటూ తన పంచాంగాన్ని వినూత్న కోణంలో అభివ్యక్తం చేశాడు పఠాభి. పఠాభి ఇలా తన కవిత్వంలో తనదైన విచక్షణతో పదప్రయోగ వైచిత్రిని ప్రదర్శించి ప్రయోగవాదిగా ముద్రవేసుకున్నాడు.



డా॥ పి. విజయకుమార్
అసోసియేట్ ప్రొఫెసర్,
తెలుగుశాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్ -500 046
ఫోన్: 90637 02546

## మట్టి కుండ ప్రయాణం..!!

ధరణి గర్భాన నిద్రించిన మట్టిని
ఒక ఆశతో చేతబట్టిన కుమ్మరి...
నీటితో తడిపి నిర్మలత్వం తెచ్చి
మట్టి ముద్దకు సౌందర్యాన్నిచ్చి..

పాదాలతో తొక్కి క్షమించమని మొక్కి
ప్రాణం పోసి శిల్పంగా మార్చుటకు
సానబెట్టిన చక్రంపై సందడి చేశాడు
మరో బ్రహ్మగా సృష్టిలో నిలిచాడు..

చేతి వేళ్ల సున్నితమైన స్పర్శతో
బిడ్డను లాలించి పెంచుతున్నట్లుగా..
కళ్లముందు కదలికలతో ప్రాణం పోస్తూ
రూపులేని మట్టికి ఒక రూపమిచ్చాడు..

పచ్చి మట్టి కుండగా మారింది
నిప్పుల కొలిమిలో తనువును కాల్చుకుంది
నిబ్బరాన్ని నేర్చుకుంది..
నేలపై పవిత్రమైన పాత్రగా నిలిచింది.

దాహార్తిని తీర్చే అమృతభాండమైంది
పండుగ పూట నైవేద్యాల నిలయమైంది..
పుట్టుక నుండి చావు వరకు తోడై నిలిచి
మట్టిలో ఐక్యమయ్యే వరకు వెన్నంటి ఉంది..

రంగులు అద్దుకుని సింగారించుకుంది
తానొక మట్టి ముక్కనన్న సంగతి మరిచి..
నిత్య నూతన శిల్ప సుందరిగా
మనసు దోచే మధుర కూజా అయింది..

కానీ కాలం ఆగదు కదా!
చిన్నపాటి దెబ్బకు ముక్కలై నేలరాలింది
అప్పటిదాకా ఉన్న ఆకారం ఆవిరైపోయింది
అహంకారం వీడి మళ్ళీ అమ్మ ఒడికి చేరుకుంది.

మట్టి నుండి పుట్టి.. మట్టి కోసమే బ్రతికి..
చివరికి మట్టిలోనే మౌనంగా ఒదిగిపోయింది!
మట్టి తత్వాన్ని తెలుసుకొని
మట్టిలోనే జన్మ ధన్యం చేసుకుంది..

కొప్పుల ప్రసాద్, నంద్యాల
9885066235



## మా ఊరు మానవీయ కావ్యం

ఊరంటే అందరికి జోరే
అందరం బంతిపువ్వు లా
ఒకేపువ్వోలే ఒదిగిపోయే రేకులం.

ఏ ఒక్కరికి ఆపదొచ్చినా
వాడవాడంతా వానరుల్లా కదిలొచ్చి
వాళ్ళ కన్నీళ్ళలో మాకన్నీళ్ళు
కలిసిపోయేవి
ఆ ఇంటికి దీపమై వెలుగయ్యేది.

ఊరంటే బడి
బడికి తోడు గుడి
రెండూ ఒక అపురూప జంట.
గోపురంమంతా గౌరవం
గుడికి దక్కింది కాని
సర్కార్ బడికి కార్పోరేట్ కోబ్రాలు
కాటు వేసి కాలం చెల్లించాయి.

ఊరంటే
కట్టకింద వెండిమేఘం వలె
నిండు గర్భినిలా తొణికిసలాడుతూ
మాతృమూర్తి లా ఉండే మా చెరువు
మమ్ములందర్ని సాదింది
ఊరుకి ఉదయమై, హృదయమై నిలిచేది.

ఊరంటే
నెర్రెవాసిన నేల బతుకులల్లా
నీళ్ళు పారించి
మా కన్నీళ్ళకు అడ్డుకట్టలు వేస్తుంది.
ఊరంటే రచ్చబండ
గడియ గడిచిన జ్ఞాపకాలు
ఉదయాన్నే పొల్లుబోకుండా
అసెంబ్లీలో చర్చలా సాగే
బతుకుదెరువుల వేదిక.

ఊరంటే
పండుగలు పబ్బాలతో
మోదుగుపువ్వు రంగులా
జీవితాన్ని రంగరించుకునేది.
నేడు రాజకీయ రంగులులొచ్చి
మత్తులో తూగుతున్న
తుంటరి పిల్లగాలిలా ఊగుతుంది ఊరు.

ఊరిప్పుడు
కళచెదిరిన స్మారక స్థూపంలా
స్తబ్ధంగా నిటారుగా నిలబడి
దిక్కులు చూస్తూ దిగులు చెందుతుంది.

డా. గిన్నారపు ఆదినారాయణ
అసిస్టెంట్ ప్రొఫెసర్
ఉస్మానియా యూనివర్సిటీ
9949532456



## మేరా జహాన్

అస్తిత్వ పోరాటపు అక్షర కావ్యం
కళాత్మక సత్యాన్ని ఆవిష్కరించే అంతరంగ చిత్రం...
తప్పు కాదు..
తన మూలాలను, తన ప్రపంచాన్ని వెతుక్కోవడం!
అక్షరం సాక్షిగా
ముస్లిం స్త్రీ అస్తిత్వాన్ని చాటుకోవడం
నేరం అంతకన్నా కాదు!
ఎటొచ్చీ...
పర్దా వెనుక ప్రాణాన్ని అణచిపెట్టి
గుండె చప్పుళ్లను దాచిపెట్టి
నిశ్శబ్దంగా బానిసవ్వడమే అసలైన తప్పు!
సాధారణంగా...
నవలలు అంటే కాలక్షేపపు కథలు అనుకుంటారు.
కానీ...
ముస్లిం మహిళల మూగవేదనను
అక్షరబద్ధం చేస్తూ
డాక్టర్ షాజహానా గారు చేసిన ఈ రచన ఒక
'సాహసోపేత ఆవిష్కరణ'.
ఇది కేవలం...
ఒక వ్యక్తి గడిచిన కాలం కాదు,
ఒక సమూహం అనుభవించిన సామాజిక ఒత్తిడి..
అణగారిన గొంతుకల నిలువుటద్దం!
ఎక్కడ చూసినా...
పితృస్వామ్య వ్యవస్థ మూలాలు ఒకటే!
ఆంక్షలను ఎండగట్టడం కంటే
స్త్రీ జీవితాన్ని ఒక విశిష్ట కోణంలో దర్శింపజేయడం,
మతాన్ని ఒక అడ్డంకిగా కాక
సంస్కృతిలోని అంతర్భాగంగా చూపిస్తూనే
స్వేచ్ఛ కోసం సాగిపోయిన శైలి.. అద్భుతం!
వచనంలో సాగుతూనే...
చైతన్యపు పరిమళాన్ని వెదజల్లే
ఒక అక్షర సత్యం ఈ గ్రంథం.
?సామాజిక నేపథ్యం...
మానవీయ స్పృహ...
నాలుగు గోడల మధ్య
కనిపించని బానిసత్వపు గీతలు,
మతపరమైన ఆంక్షల గాయాలు
ఈ రచనలో పచ్చిగా కనిపిస్తాయి.
ముఖ్యంగా...
ముసుగు వెనుక ఉన్న ముగ్ధల కష్టాలు
వ్యవస్థలోని పితృస్వామ్య లోపాలను
తన అనుభవాల కంచె దాటించి
ప్రతి వాక్యంలో ఒక సామాజిక సత్యాన్ని నిక్షిప్తం
చేశారు.
ప్రపంచం అంటే...
కేవలం బయట కనిపించేది కాదు,
తనకంటూ నిర్మించుకునే ఒక గుర్తింపు!
విద్యే ఏకైక మార్గమని నమ్మి,
చీకటి గదుల నుండి
జ్ఞానమనే వెలుగు వైపు
బాల్యంలో మొదలైన అక్షరాభ్యాసం
సొంత ఉనికిని చాటే వరకు
ఎదురైన అడ్డంకులు ఎన్నో!
ఆత్మగౌరవ పోరాటం...
స్త్రీ జీవితాల్లో
నిర్ణయాధికారం అనేది ఒక విలాసం కాదు,
అది ఒక హక్కు.
చిన్నచూపును ఎదుర్కొని,
తన ప్రపంచాన్ని తానే నిర్మించుకోవడంలో
చూపిన పట్టుదల
మౌనం నుండి తిరుగుబాటు వైపు మళ్లిన చారిత్రక
పరిణామం!
ఈ నవల...
కేవలం ఒక కథా సంపుటి మాత్రమే కాదు,
రాబోయే తరాల మహిళలకు ఒక దిశానిర్దేశం.
మనిషి విధించిన కట్టుబాట్ల కంటే
ఆత్మవిశ్వాసంతో సంపాదించుకునే విద్యే గొప్పదని
చాటిచెప్పే ఒక నిశబ్ద విప్లవం!
అక్షరం...
కేవలం ఒక గుర్తు కాదు,
అది ఒక ఆయుధం!
వ్యక్తిగత ఎదుగుదల
సామాజిక చైతన్యంతో ముడిపడినప్పుడు
ఒక నవల... ఒక జాతి చరిత్రగా మారుతుంది.
"మేరా జహాన్"
కేవలం షాజహానా గారి ప్రయాణం మాత్రమే
కాదు...
అది పితృస్వామ్యానికి వ్యతిరేకంగా
ముస్లిం మహిళ చేసిన యుద్ధం!
తెలుగు సాహిత్య చరిత్రలో
ఇది ఒక మైలురాయి,
అస్తిత్వం కోసం పోరాడే ప్రతి స్త్రీకి ఒక గొప్ప స్ఫూర్తి!

బి. రామకృష్ణ రెడ్డి
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఫోన్: 7382546949



## నేనే ఒక నినాదాన్ని!

నేనేది రాసినా.. నేనేది చేసినా..
నా పాఠకుడి రక్తంలో
ఉరికించే సెగవ్వాలనుకుంటాను!
నా మాట వినగానే గుండె లయ స్తంభించి..
మళ్ళీ కొత్త ఊపిరి పోసుకోవాలనుకుంటాను.
పిడికిలి బిగించమని నేనెవరికీ పిలుపునివ్వను..
నీ కన్నా ముందే నేనొక పిడికిలై ముందుంటాను!
నీకు తెలియకుండానే
 నా అక్షరాల వాడికి నువ్వు ముగ్ధుడవ్వాలి.
నీ ధమనుల్లో ప్రకంపనలు సృష్టించాలి
నీ సిరల్ని సుడిగాలితో ముడివేసే వేగం నాది
అంతలోనే,
తీయని అనుభూతితో
నీ మనసుని తడిపే ఆర్ద్రత నాది
రోషంతో నీ రోమాల్ని నిక్కపొడిపిస్తాను
నీ పాదాల్ని గాలిలో ఎగిరేలా గంతులేయిస్తాను
ఆదే. నా దృష్టిలో అసలు సిసలైన రాత
నీ దంతాల్ని ఆవేశంతో పదే పదే ఢీకొట్టిస్తాను.
ముసలితనంలో యువతరం ఉత్సాహాన్ని
యువతలో ప్రభంజనపు వేగాన్ని రగిలిస్తాను
సామాన్యుడి గుండెల్లోకి నా అక్షరం ఓ ఆయుధం
నా సిరా చుక్కలు నినాదాలై
నిన్ను వెంటాడాలి
నేనేది రాసినా.. ఏది చేసినా..
నా అక్షరమే ఓ యుద్ధనౌక!
నేనొక్కడినై
అందరినవుతాను
నేనొంటరినై
నేనొక సమూహాన్నవుతాను!

బ్యాగరి అంజి,
9618984596



నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
ఆదివారం 19-04-2026

## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

## కాశీ క్షేత్రం...



సీ.
గంగలో వరుణాసి కలియు నిచ్చోటనే
సత్కార్యములు నెల్ల సఫల మగును
యాగాది క్రతువులు నక్షయమై నిల్చు
మరణమందిన కాని మాన్యుడగును
జన్మ సాఫల్యమై సంస్తుతింప బడుచు
భవబంధములు వీడి పరవశించు
అరివర్గమును కూల్చి యానందడోలికల్
తేలియాడగ జేసి మేలు గూర్చు
తే.గీ.
కనిన పరమేశ్వరుని లీల వినుచు నున్న
పాపపంకిలమ్మును వీడి పరగుచుండు
సకల భక్త మోక్షప్రద స్థావరమ్ము
శివ కృపాలబ్ధ వరము కాశీపురమ్ము.



జి.గోవర్ధన్, తెలుగు లెక్చరర్,
ఎం.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలెం,
మహబూబ్ నగర్ 509001
8106384812

## మనం చూస్తూ ఉండిపోవాల్సిందే....

దేశమంతా అశాంతి రేఖలు గీసుకుని
దిగులు కమ్మిన నిరసనల మబ్బులు
రాజకీయాల రంగుల జోరులో
పచ్చి అబద్ధాల సవతి కన్నీటితో తడుపుతుంది...

స్వార్థం నిట్ట నిలువునా
గుండె పొరల్లో పలు కోణాల్లో
అదే అదనుగా పునరావృత మౌతుంటే
మనిషి జాడనే మంద బుద్ధులతో మలుస్తూ
గాయమైన చరిత్రపై జాడలులేని వాళ్ళే
ఇవ్వాళ దేశ భక్తులుగా నీతులు వల్లిస్తూ
దేశాన్ని దిష్టి బొమ్మను చేసి
ద్వేషాన్ని నూరి పోస్తున్న కర్మాగారమైన నిజం
ముమ్మాటికీ నిజం కాదా
పెచ్చులూడి ఊరట లేని
మరణ పాత్రలా ఉందనేది వాస్తవం కాదా...
ఏ ప్రక్కను చూసినా
కులమతాల కుమ్ములాటల్లో
మనిషిని, మనిషిని చంపుకొనె
భీభత్స యుద్ధ రంగంలా ఉంది...

అరాచకత్వానికి ఆరంభ సూచకలిస్తూ
ప్రజల వైపు అడుగడుగునా
నిర్బంధం పాదం మోపి
పైశాచికత్వంతో పెనుసవాళ్లను సందిస్తూ
ప్రమాదపు శక్తిగా ప్రతి గడప
గడపకు ఆందోళన కలిగిస్తుంటే
ఊపిర్లను బిగపట్టుకొని బతకడం నిరంతరం
ఊహించలేముగా....

సానుకూలంగా స్పందించే
సమసమాజ సమిష్టి సిద్ధాంతాల వేర్లను
మనిషి గుండెలోంచి పెక లించుకొంటూ
నిస్వార్థపు నియామవళిని నిసిగ్గుగా
రూపుమాపెదె వరు?

ఏ పంచవర్ష ప్రణాళికా సూత్రం
ఐదెండ్ల దాక ఐశ్వర్యంగా
ఆకర్షంప బడుతుందా?
మనుషుల్ని నిర్భందించే ఎన్నికల మాటున
ఎన్నెన్ని ఓదార్పు ప్యాకేజీలు నిర్మిస్తేనేం?
అన్నీ తుడిచి పెట్టుకుపోయే
వాగ్దానాల జోరులోంచి రాలిన మాటలే కదా...
ఏ స్వార్థం ఎన్నాళ్ళుంటువుందో...
ఏ చరిత్ర ఎన్ని నిజాల్తో నిలుస్తుందో...!?



బాబురావు చల్లగాలి, చెన్నై
9941469728

# బంజారా అస్తిత్వ పోరాట దృశ్యకావ్యం:పోర్యతార

బంజారా అస్తిత్వ పోరాట దృశ్యకావ్యం : పోర్యతార

తెలుగు నవలా సాహిత్య ప్రస్థానంలో బంజారా జనజీవన చిత్రణకు ఒక విశిష్ట చరిత్ర ఉంది. 'శ్రీరంగరాజు చరిత్ర' (సోనాబాయి పరిణయం)లో బంజారా కన్యగా చిత్రించబడిన 'సోనాబాయి' పాత్రతో ఈ గిరిజన సాంస్కృతిక ముద్ర పడగా, తదుపరి కాలంలో కొర్రపాటి గంగాధర్ 'లంబడోళ్ళ రామదాసు' నవల ద్వారా ఆ జీవితాలను ప్రధాన ఇతివృత్తంగా మలిచారు. అయితే, శతాబ్ది కాలం వేచి చూసిన తర్వాత, బంజారా అస్తిత్వాన్ని అత్యంత ప్రామాణికంగా ఆవిష్కరిస్తూ బంజారా జాతి రచయిత వెంకట్ పవార్ కలం నుండి వెలువడిన తొలి గోర్ బంజారా చారిత్రక నవల 'పోర్యతార'. తెలంగాణ సాయుధ పోరాటం, సామాజిక అస్తిత్వ చైతన్య నేపథ్యంలో వచ్చిన 'చిల్లర దేవుళ్ళు', 'గంగు', 'మోదుగు పూలు', 'జనపదం' వంటి క్లాసిక్ నవలల సరసన నిలిచే ఈ రచన, బంజారా సంస్కృతిని, వారి పోరాట స్ఫూర్తిని తెలుగు సాహిత్య పీఠంపై సమున్నతంగా ప్రతిష్ఠించింది. తెలుగు నవలా సాహిత్యంలో గిరిజన జీవిత చిత్రణపై హైదరాబాద్ విశ్వవిద్యాలయ పరిశోధకులు జరుపుల రమేష్ తన సిద్ధాంత గ్రంథంలో పేర్కొన్నట్లుగా, గిరిజనేతర రచయిత రాసిన తొలి గిరిజన నవలగా కొర్రపాటి గంగాధర్ 'లంబడోళ్ళ రామదాసు' ప్రత్యేకతను విశ్లేషించారు. సుదీర్ఘ కాలం పాటు గిరిజనేతర రచయితలదే పైచేయిగా సాగిన ఈ ప్రస్థానంలో, 2011లో ఏకుల వెంకటేశ్వర్లు 'వెన్నెల నవ్వు' నవలతో తొలి గిరిజన నవలా రచయితగా నూతన అధ్యాయాన్ని లిఖించారు. ఆ పరంపరలో దశాబ్ద కాలం తర్వాత, బంజారా తెగకు చెందిన వెంకట్ పవర్ తన చారిత్రక నవల 'పోర్యతార' ద్వారా బంజారా జాతి నుండి వెలువడిన తొలి నవలా రచయితగా సాహితీ క్షేత్రంలో చెరగని ముద్ర వేశారు.

తెలుగు సాహితీవనంలో గిరిజన జీవన వైవిధ్యాన్ని, వారి ఆర్తిని అద్దం పడుతూ అనేకమంది ప్రతిభావంతులైన రచయితలు కలం పట్టారు. సాహూ, అల్లం రాజయ్య, డా. కేశవరెడ్డి, సాధన, వసంతరావు దేశ్‌పాండే వంటి ఉద్ధండులతో పాటు పులుగు శ్రీనివాస్, చిన్నప భారతి, అట్టాడ అప్పలనాయుడు, చంద్రశేఖర్, సలీం, జ్వలిత, శిరంశెట్టి కాంతారావు వంటి వారు తమ నవలల ద్వారా గిరిజన సానుభూతి సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. వీరంతా గిరిజన అస్తిత్వాన్ని, వారి సామాజిక పోరాటాలను వస్తువుగా స్వీకరించి, అత్యున్నత ప్రమాణాలతో కూడిన రచనలను అందిస్తూ ఆ జీవితాలకు అక్షర రూపం ఇచ్చారు. తెలంగాణ సాహిత్య అకాడమి (నవంబర్ 2025) ప్రచురించిన 'పోర్యతార' నవలలో వెంకట్ పవర్ మూడు శతాబ్దాల బంజారా సంచార చరిత్రను, వారి సాంస్కృతిక వైభవాన్ని చారిత్రక దృక్పథంతో అద్భుతంగా ఆవిష్కరించారు. పోర్యతార అంటే వేగుచుక్క అని అర్థం. రెండు విభాగాలుగా సాగే ఈ రచనలో మొదటి భాగం బంజారాల 'లదణి' జీవన శైలిని కళ్ళకు కట్టినట్లు చిత్రించగా, రెండవ భాగం వీరవనిత హీరిబాయి సాగించిన అస్తిత్వ పోరాటాన్ని అత్యంత హృద్యంగా పరిచయం చేస్తుంది. రచయిత చేసిన కఠోర శ్రమ, లోతైన పరిశోధన ఈ నవలలోని ప్రతి పుటలోనూ స్పష్టంగా కనిపిస్తూ, దీనిని ఒక విశిష్ట సాహిత్య సంపదగా తీర్చిదిద్దింది.

**బంజారా అస్తిత్వ కెరటం: 'పోర్యతార' నవల విశ్లేషణ**

వెంకట్ పవర్ రచించిన 'పోర్యతార' నవల, భారతీయ గిరిజన యవనికపై అత్యంత విశిష్టమైన బంజారా జాతి మూడు శతాబ్దాల జీవన పరిణామాన్ని, వారి అస్తిత్వ పోరాటాన్ని ఆవిష్కరించిన ఒక అద్భుత దృశ్యకావ్యం. 700కు పైగా గిరిజన తెగల్లో ఒకటైన బంజారాలు ప్రాంతాన్ని బట్టి లంబాడి, సుగాలీ వంటి పేర్లతో పిలువబడుతున్నప్పటికీ, వారి తరతరాల సంస్కృతి, భాష మరియు విలక్షణమైన వేషధారణ వారిని ప్రపంచంలో ఎక్కడున్నా ప్రత్యేకంగా నిలుపుతాయి. ఈ నవల ప్రధానంగా మూడు తరాల నాయకత్వాన్ని (హీరాలాల్ నాయక్, రూప్లా నాయక్, భీమ్లా నాయక్) చూపిస్తూ, ఆ తర్వాత బంజారా సమాజాన్ని ఏకతాటిపైకి తెచ్చిన వీరనారి హీరిబాయి పోరాట పటిమను కేంద్ర బిందువుగా చేసుకుని సాగుతుంది. నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని పులులగిరి, తిమ్మాజీపేట వంటి భౌగోళిక నేపథ్యాలలో, బ్రిటిష్ పాలనకు పూర్వపు మరియు తదనంతర సంక్లిష్ట కాలమాన పరిస్థితుల మధ్య ఈ చారిత్రక గాథ అత్యంత హృద్యంగా ఆవిష్కృతమైంది.

నాయక్ "సాంళోరే భాయిన్ సగా!/ పంచ్ పంచాయత్, రాజభోజేరో సభా/ పచారే లాఖ్, అన్ పచారే సవాలాఖ్/ భాయిన్ సగా! సే పచారే జోగత్/ మన్ చంగాతో కాకోటి మాజ్ గంగా!' అంటూ వీరి అస్తిత్వం ప్రారంభమౌతుంది. బంజారాల అనాది జీవనశైలి 'లదిణీ' (బిడారు) రూపంలో సాగే సంచార జీవనంపై ఆధారపడి ఉండేది. ఒకప్పుడు దేశదేశాలకు ధాన్యాలను రవాణా చేస్తూ లోకపు ఆకలిని తీర్చిన ఈ జాతికి 'గోర్ ధరమ్' అనేది జీవన సూత్రం. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం, ప్రకృతినే దైవంగా భావించడం వీరి ధర్మం. నాయకుడి నేతృత్వంలో సాగే వీరి తండా నిర్మాణం, వాస్తు నియమాలు, మరియు పశుసంపదపై వీరికున్న ప్రాణప్రదమైన అనురాగం వీరి సాంస్కృతిక వైభవాన్ని చాటుతాయి. అయితే, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ రాకతో వీరి రవాణా వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. 1871లో వచ్చిన 'పశువుల అతిక్రమణ చట్టం' మరియు 1924 నాటి నిజాం కాలపు 'లంబాడా-దస్తూర్-ఉల్-అమల్' చట్టాలు బంజారాలను పుట్టుకతోనే నేరస్థులుగా ముద్రవేసి, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయి. సంచార జీవనం నుండి అర్ధ-సంచార స్థాయికి, ఆపై బలవంతపు స్థిర నివాసాల వైపు మళ్లిన క్రమంలో వీరు ఎదుర్కొన్న కష్టనష్టాలు వర్ణనాతీతం.

ఈ క్లిష్ట పరిస్థితుల్లో హీరిబాయి ఒక విప్లవ శక్తిగా ఉద్భవించింది. మాతృస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా నిలిచిన ఆమె, తన ప్రజల ఆకలి తీర్చడానికి భూస్వాముల అక్రమ ధాన్యపు లారీలను అడ్డుకుని 'ధర్మయుద్ధం' ప్రకటించింది. తనను 'దొంగ' అని ముద్రవేసిన పాలకులకు సవాల్ విసిరి, పోలీసు వ్యవస్థనే బురిడీ కొట్టిస్తూ గెరిల్లా తరహా పోరాటాన్ని సాగించింది. 80 ఏళ్ల వయసులో సైతం తన పంతాన్ని వీడి, కేవలం జాతి ప్రయోజనాల కోసం ఢిల్లీకి వెళ్లి ప్రధాని ఇందిరాగాంధీని కలిసి భూమి పట్టాల కోసం పోరాడి విజయం సాధించడం ఆమె చారిత్రక ఘనత. "గుడిసెల్లో దీపాలు మారాయే తప్ప బతుకులు మారలేదు" అన్న ఆమె ఆవేదన, బంజారా సమాజం ఇంకా ఎదుర్కొంటున్న సామాజిక వివక్షకు నిదర్శనం. సాంస్కృతిక కోణంలో చూస్తే, ఈ నవల ఒక విజ్ఞాన సర్వస్వం. సీత్లా, తీజ్ వంటి పండుగలు, ఆరు నెలల పాటు సాగే అపురూప వివాహ తంతు, మరియు బంజారా భాషలోని జానపద గీతాల ద్వారా రచయిత ఈ జాతి మూలాలను అత్యంత సహజంగా చిత్రించారు. 2008 సెప్టెంబర్ 6న హీరిబాయి మరణంతో ఒక వీరోచిత అధ్యాయం ముగిసినట్లు చూపినప్పటికీ, ఆమె స్ఫూర్తి తరతరాలకు నిలిచిపోతుందని రచయిత నొక్కి చెప్పారు. వెంకట్ పవర్ కలం నుండి జాలువారిన ఈ తొలి నవల, బంజారా జాతి ఆత్మగౌరవ పోరాటాన్ని మరియు వారి సజీవ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన అద్భుత సాహిత్య సృజన.

**బంజారాల సంచార జీవితం:**

బంజారాల సంచార ప్రస్థానం కేవలం ఒక ప్రయాణం కాదు, అది తరతరాల సామాజిక బాధ్యత. 'లదిణీ' (బిడారు) రూపంలో దేశదేశాలు తిరుగుతూ, అపారమైన ధాన్య సంపదను చేరవేసి లోకపు ఆకలిని తీర్చిన ఘనత ఈ జాతిది. 'పోర్యతార' నవల ఈ 'లదిణీ' సంస్కృతిని కేంద్ర బిందువుగా చేసుకుని, మారుతున్న కాలంలో ఆ సంచార జీవనం ఎదుర్కొన్న ఒడిదుడుకులను, కష్టనష్టాలను అత్యంత ప్రభావవంతంగా ఆవిష్కరించింది. ప్రాణప్రదమైన పశుసంపదే తమ సంపదగా, జీవనోపాధిగా మలచుకున్న వీరి కథ ప్రపంచవ్యాప్త బంజారాల అస్తిత్వానికి నిలువుటద్దం. హీరాలాల్ నాయక్ సాగించిన సంజార జీవితం మరొక కొత్త జీవితానికి నాంది పలుకుతుంది. రచయిత ఎంచుకున్న 120 కుటుంబాల గాథ, వాస్తవానికి సమస్త గోర్ బంజారా సమాజపు సాంస్కృతిక మరియు చారిత్రక వారసత్వానికి ఒక సజీవ సాక్ష్యం.

**కాలం తెచ్చిన మార్పు:రాజు నుండి దొంగ అనే ముద్ర వరకు:**

బంజారాల జీవనానికి 'గోర్ ధరమ్' ప్రాణవాయువు వంటిది. "ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం, దాహంతో ఉన్న వారికి నీరివ్వడం, పరాయి వారి ఆకలిని గౌరవించడం" అనే ఈ ధార్మిక సూత్రమే వారిని ఉన్నతమైన మానవతావాదులుగా నిలిపింది. ఒకప్పుడు రాజ్యాలను పాలించిన రాజులుగా వెలుగొందిన ఈ జాతి, కాలక్రమేణా ప్రకృతితోనూ, బయటి ప్రపంచంతోనూ నిరంతర యుద్ధం చేస్తూ సంచార జీవితాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. ముఖ్యంగా బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభావంతో వారి రవాణా వ్యవస్థ ఛిన్నాభిన్నం కావడంతో, రాజులుగా ఉన్న బంజారాలు చివరకు 'దొంగల'నే ముద్రను భరించాల్సి రావడం చరిత్రలోని అత్యంత విషాదకరమైన మలుపు. సంచార జీవనం నుండి అర్ధ-సంచార స్థాయికి పడిపోయిన వీరి ప్రస్థానంలో, అస్తిత్వం కోసం వారు నేటికీ సాగిస్తున్న పోరాటం ఈ నవలలో గుండెలను హత్తుకునేలా చిత్రించబడింది. హీరాలాల్ నాయక్ నుండి రూప్లా నాయక్ వరకు సాగిన ఈ నవలా ప్రస్థానం, బంజారాల సంచార వైభవం అస్తమించి, వారు అనివార్యంగా వ్యష్టి జీవనానికి మళ్లిన తీరును లోతైన పరిశోధనతో ఆవిష్కరించింది. బ్రిటిష్ వారి పశువుల అతిక్రమణ చట్టం మరియు 1924 నాటి నిజాం కాలపు క్రూరమైన చట్టాలు ఈ తెగను పుట్టుకతోనే 'నేరస్థులు'గా ముద్రవేసి, వారి ఆత్మగౌరవాన్ని ఛిద్రం చేశాయి. స్థిర నివాసం ఏర్పరుచుకుని వ్యవసాయాన్ని నమ్ముకున్నా, అక్కడ కూడా అన్యాయం వారిని నీడలా వెంటాడింది. ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి గారు ఈ నవలకు ముందుమాట రాస్తూ బంజారాల కడగండ్లను అత్యంత విశ్లేషణాత్మకంగా వివరించారు. ఈస్ట్ ఇండియా కంపెనీ దుర్మార్గపు చట్టాలు, అణచివేసే పాలకవర్గం, దోపిడీ చేసే భూస్వాములు, మోసపూరిత వ్యాపారులు, అవినీతి ఉద్యోగులు, దారిదోపిడీ దొంగలు మాత్రమే కాక, ప్రకృతి వైపరీత్యాలైన కరువులు, క్రూరమృగాలు కూడా బంజారా జాతికి శత్రువులుగా మారి వారి బతుకులను ఛిన్నాభిన్నం చేశాయని పేర్కొన్న వైనం ఈ నవలలోని గాఢతను చాటిచెబుతుంది.

**బంజారాల సాంస్కృతిక వైవిధ్యం**

ఈ నవల బంజారాల విశిష్ట సంస్కృతికి ఒక సజీవ విజ్ఞాన సర్వస్వంలా నిలుస్తుంది. ప్రస్తుత తరానికి విస్మృతిలో ఉన్న ఎన్నో అపురూప సాంస్కృతిక విశేషాలను రచయిత ఈ కథాక్రమంలో అత్యంత నిశితంగా ఆవిష్కరించారు. 'సీత్లా' పండుగలో కొలిచే ఏడుగురు ప్రకృతి దేవతల ఆరాధన, 'తీజ్' పండుగలోని ఆధ్యాత్మిక అంతరార్థం మరియు సామాజిక న్యాయానికి ప్రతీకలైన నాయక్ సభా సంభాషణలు "నాయక్ బాపూ బొరాయో తీజ్, బాయి తారో పాలేణా/ నాయక్ బాపూతీ రాజీయోగి తీజ్, బాయి తారో పాలేణా" ఈ జాతి అస్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా, ఆరు నెలల పాటు సాగే బంజారా వివాహ క్రతువులోని ప్రతి ఘట్టం, ఆచార వ్యవహారాలు పాఠకుడిని మూడు శతాబ్దాల వెనక్కి తీసుకువెళ్లి ఆ వైభవాన్ని ప్రత్యక్షంగా అనుభవింపజేస్తాయి. పుట్టుక నుండి మరణం వరకు, ఆహారపు అలవాట్ల నుండి అపురూప వేషధారణ వరకు ప్రకృతితో మమేకమైన వీరి విలక్షణ జీవనశైలిని, సాంస్కృతిక వైవిధ్యాన్ని ఈ నవల ఒక దృశ్యకావ్యంలా మన ముందు ఉంచుతుంది. వెంకట్ పవర్ కలం నుండి జాలువారిన ఈ తొలి నవల, బంజారా జాతి మూడు శతాబ్దాల చరిత్రను అక్షరబద్ధం చేసిన ఒక అద్భుత సృజన. నవల తొలి భాగం చదువుతుంటే పాఠకుడు లదణీ బిడారుల వెంట సాగే ఒక చారిత్రక బాటసారిగా మారిపోతాడు. రెండవ భాగంలో వీరవనిత హీరిబాయి సాహసోపేత పోరాటం మనల్ని ఆ ఉద్యమ సెగల్లో భాగస్వాములను చేస్తుంది. తన సమాజం పట్ల ఉన్న బాధ్యతను గుర్తించి, ఇంతటి బృహత్తర గాథను పద్ధతిగా క్రోడీకరించిన రచయిత కృషి అభినందనీయం. ముఖ్యంగా ఈ నవలలో వాడిన భాషా శైలి పాఠకుడిని మంత్రముగ్ధులను చేస్తుంది. బంజారా గీతాలను, పదాలను మాతృభాషలోనే ఉంచుతూ, వాటికి తెలుగు అనువాదాలను అందించడం వల్ల కథలోని సహజత్వం ఏమాత్రం చెడకుండా గుండెలకు హత్తుకుంటుంది. నిత్యం 'రాం రాం' అనే ఆత్మీయ పలకరింపుతో సాగే వారి జీవన విధానం, కాలక్రమేణా మరుగున పడుతున్న తీరును రచయిత అత్యంత వేదనతో, వాస్తవికంగా చిత్రించారు. ఈ నవల కేవలం ఒక కథ కాదు, బంజారా అస్తిత్వానికి నిలువుటద్దం.

'పోర్యతార' నవల బంజారా జాతి సామాజిక-ఆర్థిక పరిణామ క్రమాన్ని అత్యంత లోతుగా విశ్లేషించింది. ఆదిలో వస్తు మార్పిడి పద్ధతితో స్వయం సమృద్ధిగా సాగిన వీరి ఆర్థిక వ్యవస్థ, ఆధునిక ద్రవ్య రూపంలోకి మారే క్రమంలో భాషా వైరుధ్యాల వల్ల మోసాలకు గురై ఎలా పతనమైందో రచయిత అద్భుతంగా చిత్రించారు. నిజాం రాజులు ఇచ్చిన "రంజన్ కా పానీ/ చప్పర్ కా ఘాస్/ దిన్ కా తీన్ ఖూన్ మాఫ్/ ఔర్ జహా ఆసఫ్ జాహీ కా ఘోడే/ వహా భంగీ జంగీకా బైల్ ఖడే" 'రాగి ఫర్మానాలు' ఈ జాతికి ఉన్న చారిత్రక మరియు రాజకీయ గుర్తింపుకు నిదర్శనాలు కాగా, క్షేత్రస్థాయిలో అవినీతి అధికారుల ధిక్కరణ రాజ్య చట్టాలకు, స్థానిక పెత్తందారీ వ్యవస్థలకు మధ్య ఉన్న సంఘర్షణను ప్రతిబింబిస్తుంది. కరువు కాటకాల సమయంలో వీరు చేపట్టిన వలసలు, తండాను ఒక రక్షణ దుర్గంలా మలచుకుని యువకులకు సైనిక శిక్షణ ఇప్పించడం వంటివి వారి అద్భుతమైన విపత్తు నిర్వహణ, యుద్ధ తంత్ర నైపుణ్యాలను చాటుతాయి. కాలక్రమేణా 'సమిష్టి' జీవనం నుండి 'వ్యష్టి' కుటుంబాలుగా మారడం, పంచాయతీ వ్యవస్థలో సంప్రదాయ పద్ధతుల స్థానంలో ఆధునిక రాజకీయాలు ప్రవేశించడం వంటి మార్పులు సామాజిక వర్గీకరణను సూచిస్తున్నాయి. 'గత్తర' వంటి ఆరోగ్య సంక్షోభాలు వీరి జీవన పోరాటంలోని విషాదాలను గుర్తుచేస్తే, "దీపాలు మారాయి కానీ బతుకులు మారలేదు" అన్న హీరిబాయి ఆవేదన, నేటికీ ఆ జాతి ఎదుర్కొంటున్న గుర్తింపు సంక్షోభానికి మరియు ఆత్మగౌరవ పోరాటానికి నిలువుటద్దంగా నిలుస్తుంది.

చివరగా చెప్పాలంటే, 'పోర్యతార' కేవలం ఒక తెగ కథ కాదు, అది అణిచివేతపై అస్తిత్వం సాధించిన విజయం. తరతరాల సంచార జీవన వైభవం నుండి, బ్రిటిష్ కాలపు క్రూర చట్టాల చీకటి కోణాల వరకు, ఆపై హీరిబాయి నాయకత్వంలో సాగిన ధర్మయుద్ధం వరకు బంజారాల సుదీర్ఘ ప్రస్థానాన్ని ఈ నవల కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించింది. ఒక జాతి తన మూలాలను, సంస్కృతిని కాపాడుకుంటూనే, ఆధునిక వ్యవస్థల మధ్య తన ఉనికిని ఎలా చాటుకుందో రచయిత వెంకట్ పవర్ అత్యంత హృద్యంగా చిత్రించారు. మాతృస్వామ్య గౌరవానికి, ప్రకృత్యారాధనకు మరియు పోరాట పటిమకు ప్రతీకగా నిలిచిన హీరిబాయి గాథ, అణగారిన వర్గాల ఆత్మగౌరవ పోరాటాలకు ఎప్పటికీ ఒక దిక్సూచిలా నిలిచిపోతుంది. తరాలు మారినా, బతుకు చిత్రాలు రూపుమార్చుకున్నా, బంజారా జాతి పౌరుషం మరియు వారి అపురూప సాంస్కృతిక వారసత్వం ఈ నవల రూపంలో కలకాలం వర్ధిల్లుతుంది.



డా. జరుపుల రమేష్,
అసోసియేట్ ప్రొఫెసర్,
కాకతీయ ప్రభుత్వ కళాశాల,
హనుమకొండ. 9618944654

# అట్టడుగు వర్గాల ఆత్మగౌరవ శిఖరం... మాలపల్లి

సాయి సాహిత్య ముచ్చట్లు

**తెలుగు సాహిత్య చరిత్రలో 'మాలపల్లి' (1922) ఒక విప్లవాత్మకమైన మలుపు. 1920ల నాటి తెలుగు సాహిత్యంలో భావకవిత్వపు కాల్పనికత, జాతీయోద్యమ మతపరమైన పరిష్కారాలు, సంఘ సంస్కరణోద్యమ పరిమిత దృక్పథాలు రాజ్యమేలుతున్న తరుణంలో... ఉన్నవ లక్ష్మీ నారాయణ అస్పృశ్యతను కేవలం సానుభూతితో కాకుండా సామాజిక, ఆర్థిక కోణాల్లో విశ్లేషించారు. నాటి సాహిత్య ధోరణులు దళిత సమస్య మూలాలను స్పృశించడంలో విఫలమవ్వగా, 'మాలపల్లి' తొలిసారిగా బోల్షెవిక్ విప్లవ ప్రేరణతో, అభ్యుదయ భావజాలంతో కులవివక్ష లేని, ఆర్థిక సమానత్వంతో కూడిన సమాజాన్ని ఆకాంక్షించింది. కేవలం ఒక నవలగా మాత్రమే కాకుండా, అట్టడుగు వర్గాల గొంతుకగా, ఆధునిక సామాజిక చైతన్యానికి ప్రతీకగా ఈ రచన నిలిచింది. మార్క్సిస్టు భావజాలం, జాతీయోద్యమ ప్రభావం, గాంధేయవాదాల మేళవింపుగా సాగిన ఈ రచన, తెలుగు సాహిత్యాన్ని కేవలం సానుభూతి నుండి అభ్యుదయ వైపుకు, ఆదర్శాల నుండి ఆచరణాత్మక ఆలోచనల వైపుకు నడిపించింది. అప్పటి సామాజిక, ఆర్థిక పరిణామాలను వాస్తవిక ధోరణితో చిత్రించిన ఈ నవలను ఎన్.జి.రంగా గారు టాల్‌స్టాయ్ రచించిన జగత్ప్రసిద్ధ నవల 'వార్ అండ్ పీస్'తో పోల్చడం, దీని చారిత్రక ప్రాధాన్యతకు నిదర్శనం.**

'మాలపల్లి' నవల ప్రచురణ, నిషేధాల పరంపర భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోని అణచివేతకు నిదర్శనంగా నిలుస్తుంది. 1922లో రెండు భాగాలుగా వెలువడిన ఈ నవలలో బోల్షెవిక్ భావాలు ఉన్నాయని, కార్మికులను యజమానులకు వ్యతిరేకంగా రెచ్చగొడుతూ ప్రభుత్వాన్ని విమర్శిస్తోందనే నెపంతో 1923 ఏప్రిల్ 5న బ్రిటిష్ ప్రభుత్వం దీనిపై మొదటిసారి నిషేధం విధించింది. ఆ తర్వాత శాసన మండలిలో జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం, కొన్ని మార్పులు చేసి 1928లో నిషేధాన్ని తొలగించగా, ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పాఠ్య గ్రంథంగా కూడా ఎంపికైంది. అయితే, 1936లో బ్రిటిష్ ప్రభుత్వం మళ్ళీ రెండోసారి ఈ నవలను నిషేధించి పాఠ్యపుస్తకాల నుండి తొలగించి నప్పటికీ, 1937లో రాజగోపాలాచారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిషేధాన్ని శాశ్వతంగా రద్దు చేసింది. రెండుసార్లు ప్రభుత్వ ఆగ్రహానికి గురైనప్పటికీ, సామాజిక చైతన్యాన్ని రగిలించిన ఈ నవల ప్రజల నుండి విశేష ఆదరణ పొందింది.

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో ఉన్నవ లక్ష్మీనారాయణ గారు రచించిన 'మాలపల్లి' (1922) ఒక అద్భుత ఘట్టం. కేవలం ఒక కథగానో, నవలగానో కాకుండా, నాటి సమాజంలోని కుల వివక్షను, ఆర్థిక అసమానతలను, భూస్వామ్య అరాచకాలను ఎండగట్టిన సామాజిక దస్తావేజులా ఉన్నదని చెప్పవచ్చు. గాంధేయవాదం, సామ్యవాదం కలబోసిన ఈ నవల, అట్టడుగు వర్గాల ఆత్మగౌరవ పోరాటానికి వెన్నుముకగా నిలిచింది. ఈ నవల అంతా 'మాలదాసరి' కులస్థుడైన రామదాసు కుటుంబం చుట్టూ తిరుగుతుంది. రామదాసు పరమ సాత్వికుడు, గాంధేయ మార్గంలో నడిచే సాంప్రదాయవాది. భార్య మహాలక్ష్మి, కొడుకులు వెంకటదాసు, సంగదాసు, కూతురు జ్యోతితో కలిసి మాలపల్లిలో శ్రమిస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ కుటుంబం కేవలం ఒక పేద కుటుంబం మాత్రమే కాదు, ఆనాటి దళిత సమాజం అనుభవించిన కష్టాలకు, అణచివేతకు ఒక ప్రతిబింబం. తమకున్న కొద్దిపాటి భూమితో ఆత్మగౌరవంతో బతకాలని వారు పడే తపన పాఠకులకు స్ఫూర్తినిస్తుంది. నవలలో కీలక మలుపు సంగదాసు పాత్ర. గ్రామ భూస్వామి చౌదరయ్య వద్ద పాలేరుగా ఉన్నప్పటికీ, సంగదాసు సంస్కరణ భావాలు కలిగినవాడు. విశేషమేమిటంటే, భూస్వామి కొడుకైన రామానాయుడు కూడా సంగదాసు ఆశయాలను గౌరవించి అతనికి స్నేహితుడిగా మారుతాడు. సంగదాసు దళిత కూలీలను సంఘటితపరిచి, వారిలో హక్కుల పట్ల అవగాహన కలిగిస్తాడు. బడులు తెరిచి విద్యను పంచుతాడు. దళితుల ఎదుగుదల సహించని భూస్వామి చౌదరయ్య, కూతురు, భార్య మరణించినా రామదాసు చలించడు. తన సహజ వేదాంత ధోరణితో ఆ బాధనంతా దిగమింగుతాడు. ఇది భార తీయ రైతాంగం యొక్క అపారమైన సహనానికి, నిబ్బరానికి నిదర్శనం. క్రైస్తవ మతం పట్ల పరోక్షంగా నిరసన కూడా ఆ నవలల్లో కనిపిస్తుంది. దళితులలోని దాసరి వ్యవస్థ గురించి అంత సమగ్రంగా వివరించన నవల కూడా లేదని చెప్పవచ్చు. ఈ నవల తెలుగులో మాక్సిం గోర్కీ రాసిన అమ్మ నవల లాంటిది అని చెప్పవచ్చు. నవల చివరి అంకం భారత స్వాతంత్ర్య ఉద్యమ ప్రభావాన్ని చూపిస్తుంది. ప్రజా స్వామ్యం రావడం, వయోజన ఓటింగ్ వంటి మార్పులు వస్తాయి. భూస్వాముల అహంకారం అణిగిపోయి, వారు తమ సర్వస్వాన్ని గ్రామ సేవకు, దళిత అభ్యుదయానికి అంకితం చేయడం ఒక ఆదర్శవంతమైన ముగింపు. రామా నాయుడు కోరినా రామదాసు గ్రామంలో ఉండక అడవులకు వెళ్లడం, అతనిలోని వైరాగ్యాన్ని, పదవుల పట్ల వ్యామోహం లేని తనాన్ని సూచిస్తుంది. 'మాలపల్లి' నవల కేవలం మాలల కథ కాదు, అది అణచివేతకు గురైన ప్రతి



సంగదాసును దారుణంగా హత్య చేస్తాడు. ఈ బలిదానం గ్రామంలో ఒక గొప్ప మార్పుకు పునాది వేస్తుంది. అతని జ్ఞాపకార్థం ఏర్పడిన 'సంగ పీఠం' ద్వారా అగ్ర కులాల వారు కూడా దళితాభ్యున్నతిలో భాగస్వాములవుతారు. ఒకవైపు సంగదాసు శాంతి యుత పోరాటం చేస్తే, అతని సోదరుడు వెంకటదాసు 'ధర్మ కన్నం' వేసే విప్లవ మార్గాన్ని ఎంచుకుంటాడు. బంకిమచంద్రుని 'ఆనందమఠం' లోని సంతానుల తరహాలోనే, ఇతను 'సంతానులు' అనే రహస్య దళాన్ని ఏర్పాటు చేస్తాడు. ధనికుల ఆస్తిని కొల్లగొట్టి పేదలకు పంచడం ద్వారా సామాజిక న్యాయం చేయాలనుకుంటాడు. అయితే, ఈ మార్గం అతన్ని జైలు పాలు చేస్తుంది, చివరికి మరణానికి దారితీ స్తుంది. భూస్వామి కుట్రల వల్ల రామదాసు తన ఆస్తిని, ఇంటిని కోల్పోతాడు. చివరికి పోలీసుల వేధింపుల వల్ల సెటిల్మెంటులో నిర్బంధ కూలీగా మారతాడు. తన కళ్ల ముందే ఇద్దరు కొడుకులు, సామాన్యుడి గాథ. దోపిడీ వ్యవస్థపై తిరుగుబాటు, కుల నిర్మూలన, విద్య ద్వారా సాధికారత వంటి అంశాలను నూరేళ్ల క్రితమే చర్చించిన ఉన్నవ గారు దార్శనికులు.



డి. సాయినాథ్ రెడ్డి
6305584064